# అన్ని మతములు బోధించే దివ్యత్వము ఒక్కటే!

పలుకులె మహా రుచి పలుకులు
పలుకులె పరిమళపు పూతలు
పలుకులె అతి మధుర మకరందములు
పలుకులె నాలుగు వేదాలు
పలుకులె శ్రుతిస్మృతి పలుకులు
పలుకులె బంధమోక్ష సుఖదుఃఖ కారణాలు.

అల్లాయంచు మహమ్మదీయులు జెహోవాయంచు సత్క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వ నెల్లరనాయుర్భోగభాగ్యాది సం
పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే చూడుడీ!

ప్రేమస్వరూపులారా!

ఈనాడు ప్రపంచములో ప్రముఖులుగాను, మహనీయులుగాను పేరు పొందిన వ్యక్తులందరుకూడను తమ పవిత్ర ప్రవర్తనచేతను, పవిత్రగుణముల చేతను యీ స్థితిని అందుకోగలిగారు. మానవుడు అనుకున్న కార్యమును సాధించవలెనన్న అచంచల దీక్షను పూనాలి. చంచల మనస్కుడైనవాడు ఎట్టి చిన్న కార్యమునైనను సాధించలేడు. ఆపదలో నున్న మానవుని ఆదుకోటం, కష్టములో ఉన్నవానికి తగిన సాయము చేసి వారిని సంతోష పెట్టటము యివి అతి శ్రేష్ఠమైన గుణములని అన్ని మతములు, అన్ని గ్రంథములుకూడను అంగీకరించినవి.

**ప్రతి మానవునియందు సమత్వముతో, ఏకత్వముతో ప్రకాశించే సచ్చిదానందము ఒక్కటే!**

srisathyasaivahiniamrutam

ఈ విశాల విశ్వమునందు ప్రతి మానవుడుకూడను సమాన అధికారము కలిగి ఉన్నాడు. అందరూ ఒక్క కుటుంబీకులే! సహనభావముతో, సామరస్యముతో కలిసిమెలసి ఐకమత్యముచే సమాజసేవలు ఆచరించి ఆత్మశాంతిని అందుకోటం అత్యవసరము. ప్రపంచములో అన్ని దేశములందుకూడను మంచివారు, చెడ్డవారు; ధనికులు, దరిద్రులు; విద్యావంతులు, విద్యాహీనులు ఉన్నారు. ఒక గడ్డపైన పుట్టి ఒక గాలిని పీల్చుకుంటూ కలతలను పెంచి భేదములను అభివృద్ధిపరచిన సంకుచిత హృదయులుకూడను ఉంటున్నారు. ఈ ప్రపంచమునందు పుట్టిన మంచి మానవుడుగా పేరు పొందాలని ఆశించే ప్రతి మానవుడుకూడను అనేక కష్టములకు, నష్టములకు, నిందలకు, నిష్ఠూరములకు గురికావలసి వస్తుంది. కానీ వీటిని ఏమాత్రము లెక్కచేయక ఆత్మవిశ్వాసముతో ఎదుర్కొని, పూర్ణత్వమును అనుభవించి, మానవత్వమును సార్థకము చేసుకోటం అత్యవసరము. దివ్యభావముగానీ దివ్యత్వముగానీ మానవాతీతమైనది కాదు. అది మానవుని సహజమే! ప్రతి మానవునియందుకూడను సమత్వముతో, ఏకత్వముతో ప్రకాశించే సచ్చిదానందము ఒక్కటే! ఐతే అనేకత్వములోని ఏకత్వమును గుర్తించలేక మానవుడు సంకుచిత హృదయుడై సమాజముయొక్క విశాలతను గుర్తించుకోలేకపోతున్నాడు. ఏకత్వభావమేకాక 'సుహృదయం సర్వభూతానాం' అనేటువంటి దివ్యమార్గమును మానవుడు అనుసరించవలసి వస్తుంది. 'ఏకాత్మసర్వభూతాంతరాత్మ' అనే పదములకు తోడుగా ప్రేమతత్త్వాన్ని, సత్యతత్త్వాన్నికూడను యిమిడ్చి జీవితమును సార్థకము గావించుకోవాలి. భగవంతుని దర్శించవలెనన్న ఏ మందిరమునందో ఏ గుడియందో ఏ ప్రార్థనా మందిరమునందో కాదు.

**భగవంతుని నిజమైన మందిరము, మానవుని హృదయ మందిరమే!**

భగవంతుడు సజీవుడై, చైతన్యస్వరూపుడై అందరి హృదయమందిరములందు కూడను ప్రకాశిస్తూ ఉన్నాడు. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ స్సనాతనః' భగవంతుని నిజమైన మందిరము, సత్యమైన మందిరము, సాక్షాత్కరింప చేసుకోవలసిన మందిరము మానవునియొక్క హృదయమే! కానీ యీనాటి మానవుడు మనసును మంటగల్పి

srisathyasaivachanamrutam

హృదయమును కల్మషము గావించుకొని పవిత్ర పీఠమైన హృదయాన్ని అపవిత్రము గావించుకొని తుచ్ఛమైన అల్పభావమునకు స్థానమిచ్చి హృదయమును మలినము గావించుకుంటున్నాడు. సామాజిక దర్పణమునందు మాత్రమే దివ్యమైన ఆత్మతత్త్వము దర్శించటానికి వీలవుతుంది. సర్వ మానవులందు అంతర్వాహినిగా ప్రవహించే ప్రేమ ఒక్కటే! కానీ యీ ప్రేమను స్వార్థస్వప్రయోజనములలో ప్రవేశపెట్టి కేవలము రాగద్వేషములకు అవకాశము నందించి తద్వారా హృదయమును మలినము గావించుకుంటున్నాడు మానవుడు. మానవునియందు నాలుగు విధములైన స్థితులు ఈ విధంగా మారుతూ వస్తుంటాయి. మానవులలోని మానవుడు, మానవులలోని దానవుడు, మానవులలోని పశువు, మానవులలోని దైవము.

**మానవత్వములో ఉండిన దివ్యత్వమును పొందటానికి తగిన కృషి చేయాలి!**

మానవులలోని దైవమును 'బ్రహ్మనిష్ఠ పరోదైవం' అనింది, శాస్త్రం. నిరంతరము తనయొక్క దివ్యత్వమును తాను చింతించుకుంటూ కేవలము ఆత్మతత్త్వమునే విశ్వసించి ఆత్మానందమును అనుభవింపగోరి అంతర్దృష్టిని అభివృద్ధిపరచుకొని కాలమునంతయు సార్థకము గావించుకుంటూ ఉంటాడు. తనయందున్న ఆత్మయే అందరియందు ఉన్నదని అందరిలో తాను, అందరితో తాను ఉన్నానని విశాలమైన భావమును అభివృద్ధిపరచుకొని దానినే విశ్వసించి తాను ప్రవర్తిస్తుంటాడు. 'సర్వభూత నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి.' ఎవరికి నమస్కరించినప్పటికీ తనయందున్న భగవంతునికే నమస్కరించినట్టుగా విశ్వసిస్తుంటాడు, బ్రహ్మజ్ఞాని. 'సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి.' ఎవరిని నిందించినప్పటికిని, ఎవరిని హింసించినప్పటికిని, తనయందున్న దైవమునే నిందించినట్టుగా భావిస్తుంటాడు యీ ఆత్మజ్ఞాని. ఇట్టివానినే 'బ్రహ్మనిష్ఠ పరోదైవం' అంటారు. మానవునియందున్న దైవము యీ రూపంగా ప్రకటిస్తూ ఉంటుంది. యిక మానవులలోని మానవుడు ఏ రీతిగా ఉంటాడు? 'సత్యధర్మపరోమర్త్యః'. అనగా మానవుడు సత్యధర్మమనే నేత్రములను పూని ఏకార్యము చేసినప్పటికిని సత్యమైనదా కాదా, ధర్మమైనదా కాదా అనే విచారము సలిపి యీ రెండింటిని తన జీవనాడులుగా విశ్వసించి

sri sathyasai vachanamrutam

జీవిస్తుంటాడు. అధికారమును ఆశించక, కర్తవ్యమును నిర్వర్తించుకుంటూ తనయొక్క మానవత్వమును నిలుపుకొనే నిమిత్తమై సత్యమార్గములో నడుస్తూ ఉంటాడు. తోటి మానవులందు ప్రేమతో జీవించి, వారిని గౌరవించి, అతిథి అభ్యాగతులను ఆదరించి, తనయొక్క గృహస్థధర్మాన్ని మానవత్వంగా నిరూపించుకుంటాడు. నిరంతరము పాపభీతిని, దైవప్రీతిని కలిగి సమాజములో నీతిగా జీవిస్తుంటాడు. ఇట్టి గుణములు కలిగినవాడే 'సత్యధర్మపరో మర్త్యః' అన్నారు. ఇంక మానవులలోని రాక్షసుడు ఏ రీతిగా ఉంటాడు? 'మద్యపానేరసో రాక్షసః' అనగా విషయవాసనలనే మద్యపానములో మునిగి, యింద్రియలోలుడై, సిగ్గు ఎగ్గులు మరచి మానమర్యాదలను లెక్కచేయక సమాజమున్నదనే విషయము విస్మరించి కేవలము అహంకారముతో జీవిస్తుంటాడు. రాగద్వేషములను అధికము చేసుకుని తోటి మానవులను హింసిస్తూ ఉత్తములను విమర్శిస్తూ తనలో ఉన్న దోషములను లెక్కచేయక నిరంతరము పరుల దోషములనే వెతుకుతూ ఉంటాడు, యీ రాక్షసగుణము కలవాడు. తన దోషములను తాను దాచిపెట్టుకొని యితరుల అల్పదోషమునే పెద్దదిగా చేసి చాటుతూ ఉంటాడు. అభిమాన, మమకారములే యితనికి ప్రాణము. అహంకారమే యితని జీవనాడి. లౌకిక జీవితమే యితని వెన్నెముక. యిలాంటి స్వార్థస్వప్రయోజనములతో కూడిన భావమునే రాక్షసత్వమని నిరూపించింది శాస్త్రము. యింక పశుత్వమనగా ఏమిటి? 'జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః' అనగా లోకజ్ఞానము లేక యింద్రియ జీవితమే తన నిజ జీవితమని భావించి, యింద్రియ భోగభాగ్యములకై ఆరాటపడుతూ పుట్టినది మొదలుకొని గిట్టునంతవరకు యింద్రియ సుఖములనే ఆశించి, కడుపే కైలాసంగా, ధనమే యినుపపెట్టెగా, లౌకికమైన ఆనందమే కైవల్యముగా భావించి జీవిస్తుంటాడు. జీవితములో పుట్టినది మొదలు గిట్టునంతవరకు యింద్రియ భోగములతోనే తన జీవితము అంత్యము గావించుకుంటాడు. యింద్రియాతీతమైన దివ్యతత్త్వము ఒకటి ఉన్నదనేటువంటి స్మృతి అతనికి ఉండదు. పశుత్వమునుండి రాక్షసత్వము, రాక్షసత్వమునుండి మానవత్వము మానవుత్వమునుండి దైవత్వమును పొందవలసిన మానవుడు యీనాడు దైవత్వమునుండి మానవత్వము, మానవత్వమునుండి రాక్షసత్వము, రాక్షసత్వమునుండి పశుత్వమునకు దిగజారుతూ వస్తున్నాడు. మానవదైవత్వము

sri sathyasai vahanamrutam

కాకపోయినప్పటికిని, మానవ మానవత్వము సాధించటానికి మనము తగిన కృషి చేయాలి. మానవత్వములో ఉండిన దివ్యత్వమును మానవత్వముచేత పొందటానికి తగిన కృషి చేయాలి!

**సజీవమైన తోటి మానవుని ప్రేమించలేని వ్యక్తి తనకు కనుపించని దైవమును ఏ రీతిగా ప్రేమించగలడు?**

డిశంబరు 25వ తేదీన జన్మించిన జీసస్‌ను చూడటానికి ముగ్గురు రాజులు వచ్చారు. యీ ముగ్గురుకూడను మూడు విధములైన భావాల్ని వెలిబుచ్చారు. ఒక రాజు యీ పిల్లవానిని చూచి 'ఇతడు భగవంతుని ప్రేమించే వ్యక్తిగా రూపొందుతాడు' అని నిర్ణయించుకున్నాడు. రెండవరాజు 'భగవంతుడే యీ పిల్లవానిని ప్రేమిస్తాడు' అని నిర్ణయించాడు. మూడవరాజు 'యితడే సాక్షాత్ భగవంతుడ'ని నిర్ణయించాడు. ఒకరు శరీరభావమును అనుసరిస్తూ వచ్చాడు. రెండవవాడు మానసికభావమును అనుసరిస్తూ వచ్చాడు. మూడవవాడు ఆత్మభావాన్ని అనుసరిస్తూ వచ్చాడు. The one you think you are is the physical body. The one others think you are is the mental body. The one you really are. That is Atma. మానవత్వాన్ని దైవత్వముగా మార్చుకునే నిమిత్తమై మొదట దానవత్వాన్ని, పశుత్వాన్ని నిర్మూలము గావించుకోవాలి. ఈనాటి మానవుడు నిర్జీవమైన శిలనైనా పూజిస్తున్నాడు, నిర్జీవమైన రూపములనైనా విశ్వసిస్తున్నాడు. నిర్జీవమైన రూపాలనుకూడను ప్రేమిస్తున్నాడు. కాని, సజీవమైన మానవుని ప్రేమించటానికి పూనుకోటం లేదు. యిదియే జీసస్ మొదటి బోధ. పొరుగింటివారిని నిత్యము చూస్తూకూడను వారిని ప్రేమించలేకపోతున్నాడు. నీకు కనిపించని దైవమును ప్రేమిస్తాననటంలో యేమాత్రం నమ్మకం లేదు. సజీవముతో నిత్యము చూస్తున్న వ్యక్తినే ప్రేమించలేని మానవుడు నిర్జీవమై తనకు కనుపించని దైవమును యేరీతిగా ప్రేమించగలడు? యిది అసాధ్యము.

**ఎక్కడ చూచినా ఉండిన దైవాన్ని అన్వేషణ ఎందుకు జరపాలి?**

సజీవులను ప్రేమించిన వ్యక్తియే నిర్జీవులను ప్రేమించటానికి పూనుకుంటాడు. కనుక,

srisathyasaivachanamrutam

మన ఆధ్యాత్మికమార్గముకూడా సజీవమునుండి ప్రారంభము కావాలి. సాకారమునుండి ప్రారంభము కావాలి. సర్వజీవులనుండి ప్రారంభము కావాలి. యిదియే నిజమైన ఆధ్యాత్మికము. ఆధ్యాత్మికమనగా జపము, ధ్యానము, యోగము, సత్కర్మలు ఆచరించటమే కాదు. మానవునియందున్న పశుత్వము నిర్మూలించుకొని, మానవత్వములో ఉన్న రాక్షసత్వము హతమార్చి, మానవత్వములో ఉన్న దివ్యత్వము నిరూపించాలి. నిప్పుపైన నివురు కప్పి ఉన్నది. ఆ నివురువల్ల నిప్పు మనకు కనుపించటం లేదు. నివురును ఊదివేస్తే నిప్పు మనకు కనుపిస్తుంది. అదే విధముగా సర్వుల హృదయమందుకూడను బ్రహ్మాజ్ఞాన సంబంధమైన, సత్‌చిత్‌ఆనంద సంబంధమైన జ్యోతి వెలుగుతూనే ఉంటున్నది. దీనిపైన రాగద్వేషములు, అభిమానమమకారములు, అహంకారమనే నివురు కప్పి ఉంటున్నది. వీటిని మనము తీసివేసినప్పుడే యీ సత్‌చిత్‌ఆనందమనే దివ్యత్వము మనకు గోచరిస్తుంది. కనుక దైవమనేది ఎక్కడో ఉన్నదని, ఎక్కడో అందుకొరకు అన్వేషణ జరపాలని మనము భావించరాదు. ఎక్కడ చూచినా ఉండిన దైవాన్ని అన్వేషణ ఎందుకు జరపాలి? దీనినే వేదము 'అంతర్బహిశ్చతత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః' అని ఉద్ఘాటించింది. లోపల; వెలుపల సర్వత్ర ఉండిన దైవాన్ని ఎక్కడ మనము వెతికేది? వెతకటమంటే అజ్ఞానము. ఈ అజ్ఞానము ఎలాంటిది? నిన్ను నీవు బయట వెతకటానికి ఎలా ప్రయత్నిస్తావో ఆ విధంగానే ఉంటుంది. నిన్ను నీవు బయట ఎక్కడో వెతకవు కదా! నీవు నీవుగానే ఉన్నావు. నీకు నీవే సాక్షి! అదే విధముగా దైవమే నీవై ఉండగా నిన్ను నీవు వెతుక్కోవటం ఎంత అజ్ఞానము! దైవమును వెతుక్కోవటం కూడను అంత అజ్ఞానమే! నీకు నీవే ఉనికి!

**కాలమును సార్థకము చేసుకోవటమే కాయముయొక్క కర్తవ్యము**

దైవత్వము అనేది తనయొక్క తత్వములోనే యిమిడి ఉంటున్నది. కాని, యుగములు మారేకొలది, కాలము కదిలేకొలది భావములు మారుతూ వస్తున్నాయి. జీసస్ ఎన్నియో మహత్తరమైన కార్యములు సల్పి దీనులకు, దిక్కులేనివారికి తోడుగా ఉండి, మానవునికి అవసరమైన సద్బోధలు గావించి ఎన్నో విధముల తన జీవితాన్ని త్యాగము చేశాడు. యిన్ని చేసినప్పటికిని అతనిపై రాజద్రోహనేరము మోపి అతనిని అనేక విధములుగా

హింసించారు. జీసస్ సజీవముగా ఉండినప్పుడు ఎవరూ అతనిని గౌరవించలేదు. ఏ కొద్దిమంది మాత్రమో తమ స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై అతనిని ఆశ్రయిస్తూ వచ్చారు. అవి తీరిన వెంటనే అతనిని దూరము గావించుకుంటూ వచ్చారు. జీసస్ పుట్టిన తరువాత ఒక శతాబ్దమువరకు ఎవ్వరుకూడ అతని మతమును స్వీకరించలేదు. జీసస్ చనిపోయిన నూరు సంవత్సరములతరువాత రోమ్‌లోపల ప్రజలందరు క్రీస్తుమతము స్వీకరించారు. తదుపరి నాలుగు వందల సంవత్సరముల తరువాత రోమన్ రాజులందరు తమది క్రీస్తు రాజ్యముగా ప్రకటించారు. ఈ విధంగా కొన్ని వందల సంవత్సరములు దాటినప్పటికిని, ఏసుక్రీస్తు దివ్యత్వమును ఎవరూ ఎక్కువగా గుర్తించలేదు. మానవత్వములో గాఢముగా పాతుకొనిపోయిన అజ్ఞానమే దీనికి మూలకారణము. మానవత్వములో నున్న దివ్యత్వమును గుర్తించవలెనంటే కాలము మనకు అడ్డురాదు. కారణమును గుర్తించుకుంటే కాలమును మనము పూర్తిగా స్వాధీనము చేసుకోగలము. ఈనాడు ప్రతిదానికికూడను కారణం, కారణం అంటారు. ఏమిటి కారణం? కాలాన్ని సద్వినియోగము చేయటానికి ఒక కారణం కావలెనా? కాలమే భగవంతుని స్వరూపకముగా ఉంటున్నది. కాలమును సార్థకము చేసుకోటమే కాయముయొక్క కర్తవ్యము.

**కాల, కర్మ, కారణ, కర్తవ్యములతో కూడినవాడే మానవుడు**

కాలమును కాయముతో సార్థకము చేసుకున్నప్పుడే కర్మ పవిత్రమై పోతుంది. కర్మ పవిత్రమైనప్పుడే కర్తవ్యమును నెరవేర్చినవారమవుతాము. కాలకర్మకారణ కర్తవ్యములతో కూడినవాడే మానవుడు. ఈ నాల్గింటితో కూడిన జీవితమే సత్యమైన జీవితము. కాలకర్మకారణ కర్తవ్యములే లేకుండా పోయినప్పుడు అది అసత్యమే! ఒక చిన్న ఉదాహరణము. నీవు ప్రశాంతినిలయములో శుక్రవారం తెల్లవారి బయలుదేరావు. మద్రాసుకు సాయంకాలము చేరినావు. 8 గంటల కాలము అయింది. ఎట్లా నీవు ప్రయాణము చేశావు? బస్సులో నీవు కూర్చున్నావు. ప్రయాణమై మద్రాసుకు 8 గంటలకు చేరావు. ఈ మద్రాసుకు చేరటంలో ఉండిన కారణం ఏమిటి? మీ బంధువులను చూడాలి. యిది కారణం. ఈ కారణం అయిన తరువాత చూచినావు. కర్తవ్యం నెరవేరింది. ప్రశాంతి

sri sathyasai vahini amrutam

నిలయములో బస్సులో కూర్చోటం ఒక కర్మ. ఈ ప్రయాణమై మద్రాసు చేరటం కాలము. నీ బంధువులను చూడడం కారణం. చూచి తృప్తిపడటం నీ కర్తవ్యము. కనుక కాల, కర్మ, కారణ, కర్తవ్యములు కూడినదే సత్యము. యిది సత్యముతో కూడినది. నీవు యీనాడు ప్రశాంతినిలయములోనే ఉన్నావు. నీ రూములో నిద్రించావు. ఆ నిద్రలో నీకు ఒక కల వచ్చింది. అందులో నీవు మద్రాసు పోయి చేరినావు. నీ బంధువులను చూచావు. తృప్తిపడ్డావు. ఇదంతా ఒక కల! ఐతే యిందులో కాలకర్మకారణకర్తవ్యములు లేవు. నీవు ప్రశాంతినిలయమునుండి ఎప్పుడు బయలుదేరావు? ఎట్లా చేరినావు? ఎవరిని చూచావు అక్కడ? ఏమి తృప్తి నీవు అనుభవించావు? యిందులో యేమాత్రము లేదు. ఎప్పుడు బయలుదేరినది, కారణము లేదు, కాలము లేదు. ట్రైనులో పోయినావా, కారులో పోయినావా, ఏ మాత్రము కర్మలేదు. అక్కడ ఎవరిని చూచినట్లుగా సాక్ష్యమునందుకుంటున్నావు? అక్కడ ఏమాత్రం కారణము లేదు. ఆనందించినట్లు కర్తవ్యమే జరగలేదు. కనుక, కాలకర్మకారణకర్తవ్యములు లేనట్టిది అసత్యము. కాలకర్మకారణకర్తవ్యములతో కూడినది సత్యము. కనుక, మనము యీ సత్యమును అనుభవించాలంటే కాయముతో కర్మ ఆచరించాలి. ఈ కర్మలయొక్క లక్ష్యాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఈ లక్ష్యాన్ని సాధించటమే మనయొక్క కర్తవ్యముగా విశ్వసించాలి.

**తానెవరో తాను తెలుసుకునే నిమిత్తమై తనువును అనుగ్రహించాడు, భగవంతుడు**

మనము పుట్టినాము. దేనికోసం పుట్టాము? మన దివ్యత్వము మనం గుర్తించుకునే నిమిత్తమై పుట్టాము. తానెవరో తాను తెలుసుకునే నిమిత్తమై తనువును అనుగ్రహించాడు, భగవంతుడు. తనను తాను తెలుసుకోటమే కర్మ. తెలుసుకున్న తరువాత పొందే ఆనందమే కర్తవ్యము. దీనిని మానవుడు విస్మరించాడు. ఈ సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చాడు జీసస్. మనము పుట్టినాము, యీ జగత్తులో. తోటి మానవులకు సేవ చెయ్యాలి, మనము. ఈ సేవ చేసే నిమిత్తము దేహము ధరించాము. యీ దేహముచేత సమాజసేవ చెయ్యాలి. దీనులను, దిక్కులేనివారలను రక్షించే సేవలను మనం చేబట్టాలని బోధిస్తూ వచ్చాడు, జీసస్. దీనినే వేదాంతము మన కాయము కర్మ నిమిత్తమై వచ్చిందని బోధించింది. యిలాంటి సత్యాన్ని

మనం యీనాడు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

**వివిధమతములలో మార్గములు భిన్నముగా ఉండినప్పటికి, గమ్యము ఒక్కటే!**

జీసస్‌ను ఒక రాజద్రోహిగా భావించి ఒక శుక్రవారంనాడు అతనిని శిలువపైన ప్రాణము తీశారు. తదుపరి, ఆ ఆదివారంరోజు తిరిగి వచ్చాడని క్రైస్తవులయొక్క విశ్వాసము. ఇతను తిరిగి వచ్చిన దినము కనుక, ఆదివారము చర్చిలోపల ప్రార్థన చేయటం అంతరార్థముగా ఉంటున్నది. యితనియొక్క అనుచరులలోపల కేథలిక్కు ప్రధానులు. ఈ కేథలిక్కు క్రీస్తు తల్లిని ఆధారంగా తీసుకున్నారు. తల్లి మేరీని పూజిస్తూ వచ్చారు. వీరు 24వ తేదీ మాత్రమే పూజిస్తారు. ఇందుకు భిన్నంగా ప్రొటెస్టెంటులు క్రీస్తు పుట్టినదినమే అతనిని ఆరాధన చేస్తూ ఉంటారు. యిరువురియొక్క భావములు ఒక్కటే అయినప్పటికిని, 24వ తేదీ సాయంకాలము ప్రార్థనలు చేయటము, పండుగ గావించుకోటము, యిది కేథలిక్కు ప్రధాన ధర్మమనుకున్నారు. జీసస్ పుట్టిన దినమే ప్రధానమైనదిగా భావించి ప్రొటెస్టెంట్సు 25వ తేదీ మాత్రమే పండుగ చేస్తూ వచ్చారు. క్రిస్మస్ పర్వదినమునాడు ఒక వృక్షమును అక్కడ పెట్టి దానిని ఆరాధించడం ప్రాచీనకాలమునుండి వస్తున్న ఒక క్రైస్తవ సాంప్రదాయము. ఈ సాంప్రదాయము మొట్టమొదట జర్మనీ దేశములో ప్రారంభమైంది. భగవంతుడు 'ఓక్ వృక్షము'లో ఉంటాడని వారి విశ్వాసము. ఒకప్పుడు జెన్సెన్ అనే మతప్రచారకుడు, ఇంగ్లాండు దేశమునకు చెందినవాడు, జర్మనీ దేశములో పర్యటిస్తున్నప్పుడు కొంతమంది జర్మన్లు భగవంతుడు వృక్షములోకూడా ఉంటాడని విశ్వసించి ఆ వృక్షమును ఆరాధించడం చూచాడు. ఇది చూచిన జెన్సెన్ ఆశ్చర్యపోయి ఈ రకమైన ఆరాధనకు కారణమేమిటని వారిని ప్రశ్నించాడు. ఈయొక్క వృక్షములో భగవంతుడున్నాడని వారు తెలిపారు. అప్పుడు జెన్సెన్ ఒక గొడ్డలి తీసుకొని ఆ చెట్టును నిలువునా నరికాడు. అప్పుడు అక్కడ జరిగిన ఒక దివ్యసంఘటన జెన్సెన్‌ను కదిల్చివేసింది. నిలువుగా చీలిన ఆ వృక్షముమధ్య ఒక శిశువు మాదిరి కనుపించింది. ఈ సంఘటన ప్రతి ప్రాణియందు భగవంతుడున్నాడు అనే విషయమును నిరూపిస్తుంది. కేవలము మనుష్యులందు మాత్రమే కాదు, పశు పక్షి మృగాదులందు మాత్రమే కాదు, వృక్షములందు కూడను భగవంతుడున్నాడు అనే విషయం

srisathyasaivachanamrutam

అతనికి బోధపడింది. అదే భారతీయ సంస్కృతి. ఈ సంఘటనను ఆధారము చేసుకొని ప్రపంచమంతా క్రైస్తవులు ఆనాటినుండి వృక్షాన్ని పూజిస్తూ వచ్చారు. ప్రతి మతమునందు సర్వజీవులను పూజించే పద్ధతి ఆనాటినుండి నేటివరకు వస్తున్నది. క్రిష్టియన్సులోపలకూడను సన్యాసులుంటున్నారు. క్రైస్తవమతములో మగ సన్యాసులను 'మాంక్' అని పిలుస్తున్నారు. ఆడ సన్యాసినులను 'నన్సు' అని పిలుస్తూ వచ్చారు. కనుక, భారతీయ సంస్కృతికి, క్రిష్టియను సంస్కృతికి, ముస్లిము సంస్కృతికి, అంతేకాదు, ఏ మతసంస్కృతిలోగానీ భేదములు ఎక్కడా లేవు. మార్గములు భిన్నముగా ఉండినప్పటికిని, గమ్యము ఒక్కటే! ఏ మతమువారినికూడను మనము విమర్శించరాదు. అన్ని మతములందు ఉండిన దివ్యత్వము ఒక్కటే! కానీ యీనాటి మానవులు యిట్టి విశాలమైన భావమును కోల్పోతున్నారు. సంకుచితమైన భావములను అభివృద్ధి పరచుకొని, భౌతికమైన జీవితమే సత్యముగా విశ్వసించి, నిత్యసత్యనిర్మలమైన ఆత్మతత్త్వమును విస్మరిస్తున్నారు.

**మహాపురుషుల ఆదర్శములను మనము ఆచరించినప్పుడే వారి నిజమైన పుట్టినరోజులను జరుపుకున్నవారమవుతాము**

పూర్వము 'నికోలాస్' అనే క్రైస్తవ సన్యాసి ఉండేవాడు. అతను కొంతకాలము వ్యాపారము చేస్తూ ఉండేవాడు. క్రమేణా వ్యాపారము విడిచిపెట్టి క్రిష్టియన్ మతమును స్వీకరించాడు. అతను వ్యాపారిగా ఉండినప్పుడుకూడను బీదలను, బలహీనులను చూచి జాలితో వారికి అవసరమైన పదార్థములను అందిస్తూ వచ్చేవాడు. కొన్ని సంవత్సరాలకు అతనిని ఒక చర్చికి అధికారిగా చేశారు. అప్పుడు అతను ఎఱ్ఱని డ్రస్సు వేసుకొని తెల్లని గెడ్డము, మీసాలు పెట్టుకొని సంచులలో అనేక తినుబండారములంతా పెట్టుకొని పిల్లలకు పంచుతూ వచ్చాడు. అతనినే యీనాడు 'క్రిస్‌మస్ తాత' అని పిలుస్తూ వచ్చారు. నికోలాస్‌యే యీనాడు క్రిస్మస్ తాతగా మారాడు. అతను పుట్టినదికూడను డిశంబరు మాసములోనే! తేదీలు మార్పు అయినప్పటికిని జీసస్ పుట్టిన దినమునకు, అతనికి సంబంధము కలిపి యీ విధమైన పండుగ చేసుకుంటూ వచ్చారు. ఈనాడు అన్ని మతములందు మహనీయులు బోధించిన వాక్యములు, సదాచారములను విస్మరించి



sri sathyasai vachanamrutam

కేవలము వారి జన్మదినములు మాత్రమే సల్పుకుంటున్నారు. ఇది సరికాదు. వారి ఆదర్శములు మనము ఆచరించినప్పుడే వారి నిజమైన పుట్టినరోజును మనము జరుపుకున్నవారమవుతాము! వారి ఆదర్శములను తిరస్కరించి, ఆచారములను విస్మరించి, వారి ఆచరణను పక్కకు నెట్టి, వారి సిద్ధాంతములను లక్ష్యము చేయక, వారియొక్క పుట్టిన పండుగలను ఆచరిస్తూ రావటంవల్ల యిది ఎంత కృత్రిమమైనదిగా ఉంటుంది! ఈనాడు అన్ని మతములందు పర్వదినములను కేవలం కృత్రిమముగా ఆచరిస్తూ ఆనందిస్తూ ఉన్నారే గాని, యథార్థమైన, సార్థకమైన, సత్యమైన మార్గమును గుర్తించుకోటానికి ప్రజలు తగిన కృషి చేయటం లేదు. సజీవులను విస్మరించి, నిర్జీవులను విశ్వసించి, స్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై అనేక విధములైన సత్కర్మలు ఆచరిస్తున్నారు. యిది కాదు, జీసస్ బోధించినది. జీసస్ బోధలలో మొట్టమొదటిది, సర్వజీవులను ప్రేమించాలి. కరుణే ప్రధానమైన మార్గము. ప్రేమయే ప్రధానమైన సూత్రము. దయయే ప్రధానమైన ఆచారము. ఇట్టి మార్గమును అనుసరించినప్పుడు మాత్రమే క్రిస్మస్ పండుగ చేసుకున్న దాంట్లో ఒక సార్థకము ఉంటుంది. కనుక జీసస్ బోధలు మొట్టమొదట మన హృదయములోపల చిత్రించుకోవాలి. తరువాత మనము చేసే ప్రతి పనులయందు అవి ప్రతిబింబిస్తూ ఉండాలి.

**ప్రవృత్తి తలకు సంబంధించినది; నివృత్తి హృదయమునకు సంబంధించినది**

నిజంగా పూజ అంటే ఏమిటి? Reflection of the inner being. లోపల ఉన్నదానిని బయటకు తెచ్చుకొని దానిని మనం అనుభవించటమే నిజమైన పూజ. ఈనాడు లోపల ఉన్నదానిని మనం బయటకు తెచ్చుకోటం లేదు. బయట ఉన్న దానిని లోపలకు పంపుతున్నాము. బయట ఉన్నదంతా అనిత్యము, అశాశ్వతము, అసత్యమే! యిదంతా ప్రవృత్తి. నిజమైన నివృత్తి లోపల ఉంటున్నాది. ప్రవృత్తి అంతా తలతో కూడినది. నివృత్తి అంతయు హృదయంతో చేరినది. కనుక హృదయముతో నీవు పూజించు. ప్రేమతో నీవు పూజించు. ప్రేమకు ప్రధాన స్థానము హృదయమే! తలతో నీవు పూజించటంచేత యిది కేవలము ఆడంబర నివాసమైనది. యిది కేవలము గాలి మేఘములవంటివే! ప్రేమ

srisathyasai vahini amrutam

మేఘములు లోపల ఉంటున్నాయి. ఆ ప్రేమ మేఘములే వర్షము కురిసి దాహము చల్లారుస్తుంది. గాలి మేఘములు మనకు యేమాత్రము తాపమును చల్లార్చలేవు. ప్రేమతత్త్వంతో నీవు జీవించాలి. ప్రేమ జీవితమును నీవు గడపాలి. యిదే ప్రధానమైన క్రిస్‌మస్‌యొక్క ఆరాధన.

భగవంతునికి చావుపుట్టుకలు రెండూ లేవు. ఏ విధమైన మార్పులు లేవు.

**చావుపుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆదిమధ్యాంతరహితు డనాదివాడు**
**తాను చావక పుట్టక చంపబడక**
**అంతటను సర్వసాక్షియై వెలసియుండు.**

కానీ, చావు పుట్టుకలతో కూడిన మానవుడు అశాశ్వతమైన ఆకారాన్ని ఆశ్రయిస్తున్నాడు. భగవంతుని తన స్థాయికి తెప్పించుకుని ఆరాధించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. యిదే సాకార ఆరాధన. అయితే మనం సాకార ఆరాధనతో ప్రారంభించి నిరాకార, నిత్యమైన, సత్యమును చేరాలి.

**భిన్నత్వములోని ఏకత్వము కేవలము ప్రశాంతినిలయమందే ఉంటున్నది**

దివ్యాత్మస్వరూపులారా! ప్రపంచములో యీనాడు క్రిస్‌మస్ పండుగ ఎన్నో చోట్ల జరుపుకుంటున్నారు. అయితే ప్రశాంతినిలయములో జరిగే క్రిస్‌మస్ పండుగ వంటిది ప్రపంచములో ఎక్కడా జరగదు. క్రీస్తు పుట్టిన జన్మస్థానములో, రోమ్‌లో అక్కడకూడను చర్చిలలో పూజలు చేస్తారు. ఆనాడు రాత్రి అంతా త్రాగటము, తందనాలాడటం, ఇలా కాలమంతా వ్యర్థము చేస్తుంటారు. కాని, అన్ని దేశములనుండి కూడిన ప్రజలు, అన్ని సిద్ధాంతములతో చేరిన ప్రజలు అందరూ ఏకంగా తెల్లవారిమొదలు రాత్రివరకుకూడను దివ్యమైన భగవత్ భావముచేత, నామముచేత కాలమును సార్థకము చేసుకున్నది, ఒక్క ప్రశాంతినిలయమునందు మాత్రమే! బాలురు మొదలు వృద్ధులవరకు, కేథలిక్కు మొదలు ప్రొటెస్టెంట్సువరకు, నాస్తికులు మొదలు ఆస్తికులవరకు, యాస్తికులు మొదలుకొని ఆస్తికనాస్తికులవరకు అందరు ఏకంగా చేరి క్రిస్మస్ పండుగ పవిత్రదినంగా జరుపుకుంటూ



sri sathyasai vachanamrutam

అద్వైత సిద్ధాంతానికి చిహ్నంగా నిరూపిస్తూ ఉంటారు. అద్వైతమనగా ఏమిటి? అనేకత్వముతోకూడిన ఏకత్వమే అద్వైతము! నిత్యజీవితములో ప్రతిక్షణము మనము అనుభవిస్తూ ఉండినటువంటిదే! ఎవరైనా పెద్దలను చూచినప్పుడు నమస్కారమంటారు. ఏమిటి యీ నమస్కారములో ఉండిన అంతరార్థము? శబ్దస్పర్శరూపరసగంధాదులు, ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములతో కూడినవాడు మానవుడు. మానవుడు దశేంద్రియములతో కూడినవాడు కనుక యీ దశేంద్రియములను ఏకము చేసి, అనేకంగా ఉండిన దానిని ఏకం చేయటమే అద్వైతము. అదే నమస్కారము. నేను అనే భావనలేని, అహంకారములేని భావమే నమస్కారము. అనగా యింద్రియములు ఏకము చేసినప్పుడు అహంకారమునకు అవకాశమే లేదు. ఆ యూనిటీయే ప్యూరిటీ! ఆ ప్యూరిటీనే డివినిటీ! ఈనాడు యూనిటీనే లేదు, యింక ప్యూరిటీ ఎక్కడనుంచి వస్తుంది? ఈ ప్యూరిటీ లేనప్పుడు డివినిటీని యేరీతిగా గుర్తించగలరు? Unity in diversity కేవలము ప్రశాంతినిలయమునందు మాత్రమే ఉంటున్నది. ఎంతమందో రాజకీయవేత్తలు, ఎంతమందో మతప్రచారకులు, ఎంతమందో ప్రవక్తలు అందరూ ఏకత్వము కావాలని విశ్వసిస్తూ ఉంటారు, ప్రబోధిస్తూ ఉంటారు. కానీ ఎక్కడా ఆచరించి, ఆనందించే స్థానము కనబడుటలేదు. ఆ ప్రచారము చేసే వ్యక్తులలోకూడను ఆచరణ లేకుండా ఉంటున్నది. అనాయాసంగా, అప్రయత్నంగా యీ అనేకత్వం ఏకత్వంగా కూడటం యీ ప్రశాంతినిలయమందే! ఇక్కడ అందరూ అన్నదమ్ములవలె, అక్కచెల్లెంద్రవలె జీవిస్తున్నారు. మీకు తెలుసు, ఏఏ దేశములనుండో ఎలాంటి శ్రీమంతులో మన భారతదేశమును కొనేటువంటివారంతా ఉంటున్నారు. ఇలాంటి వారందరు కూడను గొప్ప, బీద అనే భేదభావములేక అందరు ఒక్క షెడ్డులోపల ఎంతో అన్యోన్యంగా నివసిస్తూ ఆనందమును అనుభవిస్తున్నారు. వారికి వారి దేశములలో అనేక సౌకర్యములతో కూడిన భవనములుండినప్పటికిని, అందులోకూడను వారు యీ ఆనందము ననుభవించలేరు. ఏ అనుకూలములు లేకుండాపోయినప్పటికిని, ఆహారవిహారములలో మార్పు ఉండినప్పటికిని, అన్నింటిని భరించుకొని, సహించుకొని జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. దీనికి కారణము వారిలో ఉన్న పవిత్రమైన ప్రేమయే! ఆ ప్రేమ లేక మీరు యిక్కడ క్షణమైనా

ఉండలేరు.

ప్రేమస్వరూపులారా! వివిధ దేశములనుండి వచ్చిన విదేశీయులారా! మీరు అనేక కష్టములకు, బాధలకు గురౌతూకూడను వాటిని యేమాత్రము లెక్కచేయక యీ ప్రశాంతినిలయములో యే అనుకూలములు లేకపోయినప్పటికిని మీరెంతో ఆనందాన్ని అనుభవించే నిమిత్తము చాలా ఓపికతో జీవితాన్ని గడుపుతూ వస్తున్నారు. యిదే పెద్ద తపస్సు! యిది ఒక సాధన! యీ సాధనచేతనే మీయొక్క జీవితములు పవిత్రమైనవిగా రూపొందుతున్నాయి. ఇక్కడ ఎవరి ముఖము చూచినా చిరునవ్వు చిందులు త్రొక్కుతూ ఉంటుంది. వారి గృహములందుకూడను యింత ఆనందమునను భవించరు. దీనికి కారణము, స్వామిపై ఉన్న ప్రేమయే! వేలకు వేలు ఖర్చు పెట్టుకొని సర్వసౌకర్యములు, సదుపాయములు విసర్జించి అనానుకూలములతో కూడిన యీ షెడ్డులోపల నేలపైనకూడను పరుండి స్వామి చింతన చేస్తున్నారు. ఈ దృశ్యమును చూచే భారతీయులు ఎంతో సిగ్గు పడవలసివస్తుంది. భారతీయులకు ఎన్ని సదుపాయములు ఉండినప్పటికి వారి ముఖాలు చూస్తే ఆముదము ముఖములుగా ఉంటుంది. వారు ఎప్పుడూ గంభీరంగా, విచారంగా ఉన్నట్లుగా ఉంటారు. వీరు యింత అనానుకూలములుండినప్పటికిని ఆనందంగా తమ జీవితాన్ని వెళ్లబుచ్చుతూ ఉంటారు.

**ఐకమత్యముతోబాటు ఆచరణకూడను అత్యవసరము**

ప్రేమస్వరూపులారా! భగవద్భావము హృదయమునందు నింపుకున్నవానికి ఎక్కడికి పోయినా ఆనందమే! వారి వెంటనే ఉంటున్నాడు, భగవంతుడు.

> **అడవిలోననున్న ఆకాశమున నున్న**
> **పట్టణమున నున్న పల్లెనున్న**
> **గుట్టమీద నున్న నట్టేటనున్నను**
> **మదిని సాయి నిన్ను మరువడెపుడు.**

ఎక్కడ ఉండినా వారి హృదయమునందు భగవంతుడు తాండవమాడుతూంటాడు. మానవజన్మ భగవంతుని పొందే నిమిత్తమై వచ్చినది. కనుక, దీనిని పవిత్రమైన జీవితముగా

srisathyasaivachanamrutam

భావించాలి. సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థంగా చేయాలి. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'. శరీరము ధర్మ నిమిత్తమై వచ్చినది. దానిని మనము ఆచరించినప్పుడే పూర్ణమానవుడుగా మనం రూపొందుతాము. కనుక, ప్రేమతత్త్వంచేత మీరు జీవితము సార్థకము గావించుకొని, జగత్తుకుకూడను శాంతి, భద్రతలు సమకూర్చి ఐకమత్యముతో జీవితాన్ని గడపాలి. ఈనాడు ఐకమత్యము క్షీణించిపోవటంచేతనే దేశము అల్లకల్లోలములతో అనేక విధముల అశాంతిని పొందుతున్నది.

ప్రేమస్వరూపులారా! ఐకమత్యము చాలా ప్రధానము. ఐకమత్యమే జీవిత సారము. ఆచరణే దీని అభివృద్ధికి మూలకారణము. 'హలో, హలో' అని ఐకమత్యంగా ఉండి ఆచరణ లేక ప్రయోజనమేమిటి? ఐకమత్యముతోబాటు ఆచరణకూడను అత్యవసరము.

**(తేదీ 25-12-1992న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam